రామానుజార్య దివ్యాజ్ఞా వర్ధతాం! అభివర్ధతామ్!

# శ్రీసన్నిధానం

01 జనవరి 2022



ఉచిత ఆధ్యాత్మిక పక్ష పత్రిక

# శ్రీసన్నిధానం

## ఇందులో


3. నాడు-నేడు

4. గౌరవ సంపాదకుల పరిచయం

5. బాల విజ్ఞానం

6 శ్రీసన్నిధానం ఆండాళ్ తల్లి పెన్నిధానం

8. తిరుప్పావై వ్రతనియమాలు

9. యజ్ఞంతో లోకహితం

11 శ్రీరామానుజ సుధా మాధురి

12. ఆశయం-ఆకాంక్ష-ఆలోచన-ధ్యేయం



**సంపాదక మండలి**

వొద్దిపర్తి రామచంద్రమూర్తి

చీఫ్ ఎడిటర్

సముద్రాల శారద

వొపీనియన్ ఎడిటర్

డింగరి శ్రీనివాసమూర్తి

మేనేజింగ్ ఎడిటర్

**గౌరవ సంపాదకులు**

శ్రీమాన్ నంబి వేణుగోపాలాచార్య కౌశిక

శ్రీమాన్ అమరవాది వెంకటనర్సింహా చార్యులు




## ముఖచిత్ర పరిచయం

*ముఖచిత్రం 200 సంవత్సరాలుగా. డింగరి వంశ పరంపరచేత ఆరాధనలందుకునే కులధనం. గోధూర్ గ్రామ వాస్తవ్యులు శ్రీమాన్ శ్రీ డింగరి నరహరి అయ్యంగార్లు. 107 సంవత్సరాలు. జీవించి శతసంవత్సరం కైంకర్య నిష్ఠతో ఆరాధించిన అర్చామూర్తులు. శ్రీమాన్ డింగరి నరహరి స్వామి అయ్యంగార్ శ్రీ వైష్ణవ సాంప్రదాయ నిష్ఠాగరిష్టు లై, ఆచార్యస్థానీయులైన పరమభాగవతోత్తములు. వీరి తండ్రి గారయిన శ్రీమాన్ శ్రీ డింగరి పాపాచార్యుల నుండి వీరి కుమారులయిన శ్రీమాన్ శ్రీ డింగరి లక్ష్మినారాయణాచార్యుల వరకు మరియు వారి కుమారుల చేత కూడా నేటికీ సేవలందుకుంటున్న అర్చామూర్తులు. 1983 సంవత్సరంలో గోధూర్ శ్రీవేంకటేశ్వర స్వామి ప్రతిష్ఠాపనా మహోత్సవ సమయంలో శ్రీ శ్రీ శ్రీ శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి వారి కరకమలములచే మంగళాశాసనము చేయబడిన భగవన్మూర్తులు. కుల ధనమయిన పెరుమాళ్ల కృపా కటాక్షం సదా ఉండాలని శరణాగతి చేస్తూ. ప్రథమ ముఖ చిత్రంగా ముద్రించ బడింది.*

-సంపాదకులు

శ్రీమాన్ డింగరి లక్ష్మీనారాయణా చార్యులు


**PUBLISHED BY :**

డింగరి శ్రీనివాసమూర్తి

మేనేజింగ్ ఎడిటర్

చిరునామా: ఇ.నెం 10-2-225, విద్యానగర్ కరీంనగర్ ,తెలంగాణా - 505001

ఫోన్ : 0878 2933323; 9502583323;




# నాడు - నేడు

'శ్రీసన్నిధానం' పత్రికకు శ్రీశ్రీశ్రీ చిన్న జీయర్ స్వామివారి మంగళాశాసనాల స్ఫూర్తియే బలం. తొలిపత్రికను నాడు స్వామి వారు ఆవిష్కరించారు. నాడు ఆచార్యుల మంగళాశాసనాలతో మీముందుకు వచ్చిన శ్రీసన్నిధానం నేడూ మళ్లీ జగదాచార్యుల మంగళాశాసనాలతో అందించాలన్న సంపాదక వర్గం ఆశయం ఫలించింది. ఈ నేపథ్యంలోనే సంపాదకవర్గం సహకారంతో శ్రీసన్నిధానం సౌజన్యంతో శ్వాస్ (శ్రీవైష్ణవ ఆగమ సంప్రదాయ సేవాసమితి) వార్షికోత్సవ సంచికను రూపొందించి అందిచడం జరిగింది. ఆ సంచికను శ్రీశ్రీశ్రీత్రిదండి శ్రీమన్నారాయణ చిన్న జీయర్ స్వామి తిలకించి మంగళాశాసనాలను అనుగ్రహించారు. చిరునవ్వులు చిందించారు. అదే మనకు కొండంత బలం! మంగళాశాసనం!! ఆచార్య నిష్ఠతో పెద్దల మంగళాశాసనాలతో అనునిత్యం శ్రీసన్నిధానం సంప్రదాయ సౌరభాలు వెదజల్లుతుంది.

ఆధ్యాత్మిక వ్యాసరచయితలు భాగవతోత్తములు అనునిత్యం సహకారం అందించారు. కానీ కారణాంతరాలు, సాంకేతిక సమస్యల వల్ల ఇబ్బందులు వచ్చాయన్నది వాస్తవం. ముద్రణ వ్యయం నిరంతరం పెరిగిపోవడం కూడా ఒక సమస్య. కానీ మారుతున్న పరిస్థితులు, సరికొత్త సంపాదక వర్గం సహకారంతో నూతనోత్తేజంతో, వినూత్న హంగులతో సర్వాంగ సుందరంగా రంగు రంగుల హరివిల్లులా, ఆధ్యాత్మిక పరిమళాలతో డిజిటల్ రూపంలో అందించాలన్న కృషి ఫలితమే ఈ శ్రీసన్నిధానం పత్రిక.

–చీఫ్ ఎడిటర్

## గౌరవ సంపాదకుల సంక్షిప్త పరిచయం


### శ్రీనంబి వేణుగోపాలాచార్య కౌశిక



శ్రీమాన్ శ్రీనంబి వేణుగోపాలాచార్య కౌశిక గారు జగిత్యాల వాస్తవ్యులు. వీరు తెలంగాణ ప్రాంతానికే మాణిక్యం వంటివారు. ఉభయ వేదాంత పండితులు, ప్రముఖ జ్యోతిష్య వాస్తు పండితులు, అనువంశిక అర్చకులు. దైవయాజ్ఞికులు ప్రాంతీయంగా అనేక వైదిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడమే గాక, శాస్త్రజ్ఞాన ఆధ్యాత్మిక ప్రపూర్ణమైన ప్రసంగాలను చేస్తారు. అనేక సమస్యల పరిష్కారాలను సూచిస్తారు. విశేషించి ప్రాంతీయంగా శ్రీశ్రీశ్రీ శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి వారితో అనేక ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించారు.

ధనుర్మాస మహోత్సవాలు కాక ఎంతో మంది ఆచార్యులను జీయర్ స్వాములను ఒకే వేదికపైకి ఆహ్వానించి నిర్వహించిన 'కోటి కుంకుమార్చన' కార్యక్రమం నభూతో న భవిష్యతి. శ్రీశ్రీశ్రీ చిన్న జీయర్ స్వామి వారికి యజ్ఞ కార్యక్రమ నిర్వహణలో ప్రతిష్ఠా మహోత్సవాలలో భౌతికంగా సహకరించారు. ఆంతరంగికంగా కూడా సన్నిహితులు. నేటికీ వారు అడుగిడిన ప్రదేశం పాల్గొన్న కార్యక్రమం సఫలీకృతం కావడం విశేషం. పంచాంగకర్తగా, జ్యోతిష్య వాస్తు పండితులుగా, యాజ్ఞికులుగా, ఆగమ పండితులుగా, అర్చకులుగా, యజ్ఞ వేదికానిర్మాణ శాస్త్ర పరిణితిగల వారిగా, ఉభయ వేదాంత పండితులుగా వారు పొందిన కీర్తి సాటిలేనిది.

### శ్రీఅమరవాది వేంకట నరసింహాచార్యులు



శ్రీమాన్ శ్రీఅమరవాది వేంకట నరసింహాచార్యులవారు ఉభయ వేదాంత పండితులు. సంస్కృతాంధ్ర భాషలలో పాండితీ ప్రకర్ష కలవారు. శ్రీశ్రీశ్రీ పెద్ద జీయర్ స్వామి వారి కాలం నుండి సాంప్రదాయ సేవలో ఆచార్య సేవలో పాలుపంచుకొని అనేక ఆధ్యాత్మిక ప్రవచనాలు చేశారు. పూర్వాశ్రమంలో ప్రభుత్వ కళాశాల అధ్యాపకులుగా వృత్తి పరంగా సమాజానికి సేవ లందించారు. ఉభయ వేదాంత సభల్లో పాల్గొని అనేక ఆధ్యాత్మిక ప్రవచనాలు చేశారు. సాంప్రదాయ విశేషాలపై వీరిచ్చే ప్రసంగాల మాధుర్యం, శాస్త్ర పరిజ్ఞానం ఎంతో గొప్పవి. సాంప్రదాయఅంశాలు, దివ్య ప్రబంధాలు, స్తోత్రపాఠాలు ఇలా ఎన్నో అంశాలలో అనేక మంది శిష్యులకు బోధించి పరిజ్ఞాన వంతులను గావించారు. శ్రీరామాయణంపైన ఉపనిషత్తుల పైన వీరిచ్చే ప్రవచనాలు జ్ఞానబోధకాలు, కొన్ని టీవీ చానల్స్ వారు వీరి పురాణ వాగ్మాధురితో కార్యక్రమాలు చేశారు. తిరుప్పావై,అర్చిరాది ప్రవచనాల్లో నిష్ణాతులు. విశేషించి శ్రీశ్రీశ్రీ శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి వారి కోరిక మేరకు చాలా కాలం సాంప్రదాయ బోధనల నిమిత్తమై వీరు దివ్య సాకేతంలో నివాసం చేశారు. వయసు పరంగా విశ్రాంతి తీసుకోవలసిన కాలంలో కూడా ఎంతో చురుకుగా భగవత్ సంబంధ విషయాసక్తులై నిత్య పరిశోధకులై సాంప్రదాయ సేవలో శ్రమిస్తున్నారు.

## డింగరి లక్ష్మీనారాయణాచార్యులు




డింగరి లక్ష్మి నారాయణాచార్యులు గోధూరు గ్రామ వాస్తవ్యులు. శ్రీమాన్ డింగరి నరహరిస్వామి అయ్యంగార్ల శ్రీ వైష్ణవ సాంప్రదాయ నిష్ఠను పుణికి పుచ్చుకున్న భాగవత తోత్తములు. పూర్వాశ్రమంలో ఇందిరాగాంధీ పరిపాలనలో ఉన్న సమయంలో 20 సంవత్సరాల పాటు గ్రామసర్పంచ్‌గా గోధూర్ ప్రజలకు సేవలందించారు. స్థానికంగా పురాతనమైన 'గోవిందరాజస్వామివారి ఆలయం ఉండటం వలన శ్రీలక్ష్మి వెంకటేశ్వరస్వామి దేవాలయం కూడా ఉండతగినది' అనే శ్రీమాన్ డింగరి నరహరిస్వామి అయ్యంగారి సంకల్పాన్ని సాకారం చేశారు. గోధూరు నడిబొడ్డున ఎన్నో వ్యయప్రయాసలకోర్చి దేవాలయ నిర్మాణం గావించారు. 1984 చైత్రశుద్ధ ఏకాదశి రోజున శ్రీశ్రీశ్రీ శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి వారి దివ్య కరకమలములచేత శ్రీ,గోదా సహిత శ్రీవేంకటేశ్వరస్వామిని ప్రతిష్ఠించడం జరిగింది. శ్రీశ్రీశ్రీ చిన్న జీయర్ స్వామివారు ప్రతిష్ఠోత్సవం నిమిత్తం శ్రీ లక్ష్మి నారాయణాచార్యుల స్వగృహమునందు వారంరోజులు వాసం చేసి పావనం చేశారు. ఆనాటినుండి ఆచార్య కైంకర్య నిష్ఠతో రాజకీయ జీవితానికి స్వస్తిపలికి ఆధ్యాత్మిక మార్గాభిముఖులైనారు. పన్నెండు సమీప గ్రామాల వారికి ప్రముఖ జ్యోతిష్య పండితులుగా శ్రేయోభిలాషులుగా ఉన్నారు. నాడు 1990లో పట్టుదలతో "శ్రీసన్నిధానం"పత్రికను శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి వారి హస్త పద్మాలతో ప్రారంభింపజేశారు. వీరి తండ్రిగారు శ్రీమాన్ డింగరినరహరి అయ్యంగారు పరమ భాగవతోత్తములు. వీరి స్వగ్రామం గోధూరు. గోధూరు

గ్రామం ఒక చిన్న కుగ్రామం అయినా ఆధ్యాత్మిక భావనా సంపన్నమైనది. వీరి గృహం పరమ పావనమైనది. అందుకు నిదర్శనంగా ప్రత్యేక వృత్తాంతాలు ఉన్నాయి. **1954** సంవత్సరంలో గోధూరు గ్రామ సమీప మార్గమున వెళ్తూ శ్రీ శ్రీ శ్రీ పెద్ద జీయర్ స్వామి వారు, శ్రీమాన్ తె.కం. గోపాలాచార్య స్వామి వారు, శ్రీమాన్ గుదిమెళ్ళ రామానుజాచార్య స్వామివారు ఆనాడు త్రిమూర్తులుగా స్తుతింప బడే ఆచార్యత్రయం గోధూర్ గ్రామానికి వచ్చి శ్రీమాన్ నరహరి అయ్యంగార్ల భాగవత నిష్ఠను గురించి విని వారి ఇంటికి విచ్చేసి పావనం చేశారు కృపామాత్ర ప్రసన్నాచార్యులుగా అయాచితంగా విచ్చేసి అనుగ్రహించే ఆచార్యత్రయాన్ని సంతోషంగా పూర్ణకుంభ వైదికాచారంగా ఆహ్వానించారు. మరింత కరుణామూర్తులై ఆచార్యులు ఎనిమిది రోజులు వారి ఇంట్లోనే బస చేశారు. ఈ వార్త తెలిసి ఆనాటి కోరుట్ల సంపత్ కుమార యతిరాజ రామానుజజీయర్ వారు కూడా విచ్చేశారు. వారంరోజులు భగవత్ సంబంధ విషయ కాలక్షేపాలతో ఆ గృహం పావనమైనది. అటువంటి ప్రశస్త విశేషస్థలం కనుకనే శ్రీశ్రీశ్రీ చిన్న జీయర్ స్వామివారి కృపా కటాక్షాలు ప్రసరించాయి. **"1984"** సంవత్సరం శ్రీవెంకటేశ్వర స్వామి ప్రతిష్ఠా మహోత్సవానికి శ్రీశ్రీశ్రీ చిన్న జీయర్ స్వామివారు విచ్చేశారు. ప్రథమ బ్రహ్మోత్సవానికి **1985**లో రెండవసారి, **1988**లో మూడవసారి విచ్చేసి మంగళాశాసనం చేశారు. మరియు నేటి వరకు ఈ గ్రామానికి శ్రీశ్రీశ్రీ రామచంద్ర రామానుజ జీయర్ స్వామివారు దేవనాథ రామానుజ జీయర్ స్వామి వారు కూడా విచ్చేశారు. ఈ విధంగా బాల్యం నుండి పరమాచార్యులను సేవిస్తూ తండ్రి గారి స్ఫూర్తితో భాగవత ఆచార్యసేవానిరతితో శ్రీమాన్ డింగరి లక్ష్మీ నారాయణాచార్యులు జీవిస్తున్నారు. మరియు వారి ఇంటిలోగల తరతరాల ఆధ్యాత్మిక సంపద ప్రాచీన పుస్తక సముచ్చయాన్ని శ్రీ చిన్న జీయర్ స్వామివారి ఆజ్ఞతో 'జెట్' వారికి సమర్పించుకున్నారు. నియమబద్ధమైన జీవన విధానం, నిత్యానుష్ఠాన నియతి గలవారు సంపాదకులు శ్రీమాన్ డింగరి లక్ష్మీ నారాయణాచార్యులు.

# త్యాగ బుద్ధి

## బాల విజ్ఞానం

శిబి మహరాజు దాతగా పేరు పొందాడు. ఒకనాడు పావురాన్ని తరుముకుంటూ ఒక డేగ వచ్చింది. ఆ పావురం గడగడ వణుకుతూ శిబి చక్రవర్తి సమీపానికి వచ్చి వాలి, ఓరాజా! నేనొక ఋషిని. బ్రహ్మచర్య నియమంతో వేదాధ్యయనం సాగించి పాపరహితుడినై యోగశక్తులు సాధించిన వాడను. పక్షి రూపం ధరించాను. నిన్ను ప్రాణ రక్షకుడిగా తలచి శరణు వేడుతున్నాను, అని మనుష్య వాక్కుతో పలికెను. జీవికి ప్రాణం కంటే ముఖ్యమైనది కాని, ప్రాణదానం కంటే గొప్పది గాని మరొకటి లేదు, అని రాజు తలుచు చుండగా, ఆ డేగ " ఓ రాజా నీవు దీనికి అభయమిచ్చి నా ఆహారానికి అడ్డు తగలకు" అని విన్నవించెను.



ప్రాణ భీతి తో వచ్చిన శరణార్థిని రక్షించకున్న రాజ్యంలో క్షామము ఏర్పడుతుంది, కనుక ఓ పక్షిరాజా! ఈ పావురం కంటే బలమైన ఆహారాన్ని ఇస్తాను. పావురాన్ని విడువు అన్నాడు శిబి. పావురం కంటే రుచికరమైన ఆహారం లేదు. ఇది నాకు విధి ఇచ్చిన ఆహారం కానీ దానిని వదిలిపెట్టుమని" కోరింది డేగ.

శరణు కోరిన వారిని రక్షించడం ధర్మం, కావున నీవు మరేది కోరినా ఇస్తాను అని అన్నాడు. అప్పుడు ఆ డేగ - "ఓ రాజా! ఈ పావురంతో సమానమైన ఆహారం నీ కుడితొడ నుండి కోసి ఇవ్వు, అప్పుడు నీ ధర్మము, నా అభీష్టము నెరవేరుతాయి, అని చెప్పగా సంతోషంతో శిబి అంగీకరించాడు, త్రాసును తెప్పించి, ఒక వైపు పావురమునుంచి, మరోవైపు తన కుడి తొడను చీల్చి మాంసం కోసి వేయడం ప్రారంభించాడు. ఎంత వేసినా పావురంతో సమంగా తూగలేదు. ఇక లాభం లేదని చివరకు తానే త్రాసులో కుర్చున్నాడు. పావురానికి ప్రాణ రక్షణ జరిగి పోయింది అంటూ డేగ ఆకాశంలోకి ఎగిరి పోయింది. అంత పావురం అగ్నిదేవుని రూపంలో సాక్షాత్కరించి - "రాజా! నేను అగ్నిని, వజ్రహస్తుడైన ఇంద్రుడు మానవ శ్రేష్ఠుడైన నిన్ను పరీక్షించుటకు ఈ రూపాలలో వచ్చాము" అని పలికి అతనిని ఆశీర్వదించి అంతర్ధానమైనారు. తన త్యాగంతో శిబి ఈ లోకంలో కీర్తి కాయుడయ్యాడు. అంతే కాక స్వర్గంలో అతనికి శాశ్వత స్థానం లభించింది.

# శ్రీసన్నిధానం ఆండాళ్ తల్లి పెన్నిధానం

శ్రీ సంప్రదాయంలో శ్రీ మహాలక్ష్మీ తత్వం ఎంతో విశేషమైనది. శ్రీ శ్రియఃపతుల చేరిక లౌకిక సంబంధం వంటిది కాదు. సకల జగతికి కారణ భూతుడు ఆధారభూతుడు పరబ్రహ్మ అయితే. పరబ్రహ్మలోని జగద్రక్షక పూర్వకమైన కరుణాగుణం, దోష భోగ్యత్వమనే వాత్సల్య గుణ స్వరూపమే అమ్మ. ఆమెనే లక్ష్మీదేవి. అందుకే మన పూర్వాచార్యులు 'ఈషత్వత్కరుణా నిరీక్షణ సుధా సంధు క్షణాద్రక్షితే త్రిభువనం' ( లక్ష్మీదేవి యొక్క కొంచెం కరుణావీక్షణం అనే అమృతము తోనే లోకాలు రక్షించబడుతున్నాయి) అని కీర్తించారు. 'హ్రీశ్చతే లక్ష్మీశ్చపత్నౌ' అని ఉపనిషత్తులు లక్ష్మీపతియే పరంధాముడు అని గుర్తులు చెప్పాయి." వేదాంతాః తత్వచింతాః మురబిదురసి త్వత్ పాదచిహ్నైస్తరంతి" అని ఎవరి ఉరమందు లక్ష్మీదేవి పాద చిహ్నములు ఉంటాయో అతనే పరతత్వము అని "లక్ష్మీ చరణ లాక్షాంక సాక్షీ" అనియు, 'విష్ణువక్షస్థలస్థితాం విష్ణుపత్నీం' అనియు పరమాత్మ తత్వాన్ని మహాలక్ష్మి చేరికగా తెలియజేస్తున్నాయి వేద ఉపనిషత్తులు సకల పురాణ శాస్త్రములు విశిష్టమైన మహాలక్ష్మీ తత్వాన్ని మనకుపదేశిస్తున్నాయి. అందుకే "అమ్మ దయ ఉంటే అన్నీ ఉన్నట్టే" అని మన పెద్దల నానుడి.

ధనుర్మాస వ్రత ప్రారంభ శుభ తరుణం పురస్కరించుకొని శుభకరమగు' శ్రీసన్నిధానంలో' మహాలక్ష్మి యొక్క తత్వం యొక్క సమన్వయంతో మన పెన్నిధి అయిన ఆండాళ్ తల్లి వైభవాన్ని మనం అనుసంధానం చేద్దాం! ప్రాకృతికంగా సాత్విక గుణోద్బుద్ధమగు శ్రేష్ఠమాసము మార్గశిరమాసము." మాసానాం మార్గశీర్షోహం" అని భగవద్గీతోక్తి. సమస్త గ్రహగమనాలకు మూలమగు సూర్యభగవానుని రాశి గమనం ధనురాశి లో ప్రవేశించటం మరింత విశేషమైనది. ఈ పవిత్రమాసంలో పరమాత్మ ఉపాసనము, దీక్ష అత్యంత విశేషమైనవి. కనుకనే నాడు ఆండాల్ తల్లి సకలసంపత్ ప్రదాయకం గా తిరుప్పావై వ్రతాన్ని ఆచరించి చూపించింది. ఈ వ్రతాన్ని ఆచరించాలి, ఏమాసంలో, ఏసమయంలో, ఏవిధంగా, ఎవరిని ఉపాసించాలి, ఎంతటి హృదయ కైంకర్యంతో ఆచరించాలి అని మనకు తెలియచెప్పింది. "స్వాధు ఏకః న బుంజీథా" అని వేదం చెప్పినట్లు అందరినీ ఎలా కలుపుకోవాలి వ్రత ఫలం ఏమని ఆశించాలి, ఏవస్తువులతో ఆరాధించాలి, ప్రకృతిలోని ఏఅంశాలు వ్రతంలో కీలకం. చెట్లు, పుష్పాలు, జలసంపద, సూర్యచంద్రులు ఇత్యాది అంశాలు తెలియచెప్పింది. మన నడవడి ఎలా ఉండాలి పూర్వాచారములను ఎలా ఆచరించాలి, ఇలా అత్యంత సమగ్రంగా సంపూర్ణంగా జీవశక్తినిచ్చే ఔషధాన్ని తీయని పైపూతతో స్వీకరించేలా మార్చినట్లుగా తిరుప్పావైగా దివ్య వ్రతంగా మనకు ఉపదేశించి అనుగ్రహించింది. గోదాదేవి శ్రీ మహాలక్ష్మి అంశాస్వరూపం కనుకనే శ్రీరంగనాథుడే ఆహ్వానించి వివాహమాడాడు. తిరుప్పావైలో మనకు అన్ని ప్రశ్నలకు



సమాధానాలు దొరుకుతాయి. ఐశ్వర్యం కోరినా ఈ వ్రతం వల్ల లభిస్తుంది అందం, ఆరోగ్యం, ఆహ్లాదం, భావరసోత్కృష్టత, భక్తి పౌష్కల్యం, అన్నీ లభిస్తాయి ఇలా ఎన్ని ఫలాలు, ఫల శృతులు చెప్పినా అది అసమగ్రతే అవుతుంది. తిరుప్పావై వేద వేదాంతాల వలె గొప్పది కనుకనే దివ్య ప్రబంధంగా ద్రావిడవేదంగా స్తుతించబడుతున్నది. నీళాతుంగ స్తనగిరితటీ సుప్తముద్బోధ్య కృష్ణం" అని ప్రథమంగా ఆండాళ్ తల్లిని మన పూర్వాచార్యులు స్తుతించారు. భగవంతుని తన అధీనంలో ఉంచుకుని ఆ శ్రేయస్సును ఐశ్వర్యాన్ని మనకందరికీ పంచేదే గోదాదేవి తత్వం. ఈ వ్రతాన్ని పెద్దలు చెప్పిన రీతిన ఆచరించి పురుష కారంగా ఆండాళ్ తల్లిని ఆరాధించటం మన సౌభాగ్యం. మహాభాగ్యం. దివ్య ద్రావిడ వేద ప్రబంధాలు అన్ని మానవజాతికి అందించి భక్తి మాధురితో ముక్తి శ్రీనిధిని పొందు మార్గదర్శనం చేసిన పన్నిద్దరు ఆళ్వారులలో ఆండాళ్ తల్లిది విశేష స్థానం. ఎందుకంటే ఆమె స్త్రీ అయినందున భగవత్ శరణాగతి భావం సహజసిద్ధమైనది. అనన్య శరణత్వం,అనన్య భోగ్యత్వం, అనన్య శేషత్వం శ్రీగోదాతత్వంలో గోచరిస్తుంది. శ్రీ గోదాదేవి రచించిన తిరుప్పావైకి మన పూర్వాచార్యులు మువ్వాయిరప్పడి, ఆరాయిరప్పడి ఇత్యాది పేర్లతో వేల వ్యాఖ్యానాలను అందించారు. వేల మంది భాగవతోత్తములు తరతరాలుగా వారి వారి వాగ్మాధురితో తిరుప్పావై ప్రవచనాలతో తరింప చేస్తున్నారు. ఆండాళ్ తల్లి శ్రీ మహాలక్ష్మీ దేవి అంశా స్వరూపం కనుకనే ఆభక్తిసుధ మరింతగా పెరిగి వ్రతాచరణ వైభవం

రెట్టింపవుతున్నది.

30 పాశురాలు గల తిరుప్పావై నందు వేదాంత వైద్యుడైన పరతత్వ కళ్యాణ గుణాలు, దివ్యనామాల వైభవము, కీర్తించబడుతున్నది. గోపకులంలో అమాయకులైన లేత వయస్సు గల సుందర గోపవనితలంతాపెద్దల ఆజ్ఞతో కులక్షేమం కోరి వ్రతం ఆచరించడానికి సిద్ధపడతారు. సమవయస్కుడు, ప్రీతిపాత్రుడు అయినా శ్రీకృష్ణునితో కలిసి వ్రతం ఆచరించడానికి నియమింపబడతారు. గోదాదేవి బ్రాహ్మీ ముహూర్తం లోనే తాను మేల్కొని శ్రీకృష్ణ సమాగమోత్సుకతతో బయలుదేరి భగవద్భక్తిలో పరవశులైన ఒక్కో ప్రత్యేకత గల గోపికను నిద్ర లేపుతూ సమీకరించు కుంటుంది. 16వ విశేష పాశురం నుండి శ్రీకృష్ణ భవనం చేరి పరివారాన్ని సన్నిహితులను మేల్కొలిపి, స్తుతించి తాను దర్శించిన పరంధామునికి మంగళ నీరాజనం పాడుతుంది. ఇది ఒక మధురమైన భావనా సన్నివేశ ఘట్టంగా కనిపించినా ఇందులో నారాయణ పరతత్వాన్ని నిరూపించి భగవత్ భాగవత ఆచార్య కైంకర్య నిష్ఠను బోధించింది ఆండాళ్ తల్లి. శరణాగతి, ప్రపత్తి మార్గాన్ని ఉపదేశించింది. తాను ధరించిన మాలలకు సౌందర్య సుగంధాలు అద్ది వాటిని అర్చామూర్తికి సమర్పించి "చూడి కొడుత్త నాచ్చియార్" గా స్తుతించ బడినది. తిరుమల శ్రీనివాసుని ప్రేమించి శ్రీరంగనాథుని వివాహమాడి సాక్షాత్ మహాలక్ష్మి రంగనాయకి స్థానాన్ని పొందగలిగింది.

నీళాదేవి శ్రీకృష్ణునికి అత్యంత ప్రీతిపాత్రమైనది అందుకే మన ఆచార్యులు శ్రీభూనీళా సమేత సకల పరివార పరివృతుడైన పరమపదనాధునిగా పరమాత్ముని స్తుతిస్తారు. "దేవి భూషాది జుష్టో" అని "విష్ణుం దేవీ విభూషాయుధగణ మురగం" అని ముగ్గురు దేవేరులతో కూడి ఉన్నట్లుగా స్తుతిస్తారు. కుడివైపున శ్రీదేవి ఎడమవైపున భూనీళాదేవిలు వేంచేసినట్లుగా పరమపద నాథుని సేవిస్తాము. విశేషించి గోదాదేవి దివ్య పార్థివ దేహంతో పరమాత్ముని ఆరాధించి ఉపాసించి పొందింది కనుక పరమపద నాథుని దేవేరుల స్థానమందు వేంచేయునట్లుగా మన పూర్వాచార్యులు ఆరాధనాస్థానాన్ని ఆదేశించారు. కనుకనే ఆరాధనా సంకల్పంలో శ్రీ భూ నీళా గోదా దేవేభ్యో నమః అని స్తుతిస్తాము.

జగదాచార్యులు శ్రీభగవద్ రామానుజాచార్య భావ తాదాత్మ్యతతో దివ్య ప్రబంధం తిరుప్పావై గానం చేసేవారట! ఒక సందర్భంలో ఉందుమదగళిత్త అనుపాశురం ప్రస్తుతమై ఆ పాశుర అర్థ అనుసంధానంతో పరవశులై శ్రీ పెరియనంబిగారి కూతురు పాదాలపై తలుపులు తెరిచిన నీళాదేవిగా భావించుకొని మోకరిల్లారట!

ఆండాళ్ తల్లి తిరుప్పావై మానవులంతా తరించటానికి బీజాక్షర శోభితంగా వేదార్థ సమన్వితం గా పరమభక్తి భావ బంధురంగా రచించి వ్రత అనుసరణ రీతిగా మనకు అందించింది.

'విశ్లేష భీరుత్వం పరమా భక్తిరుచ్యతే"అని భగవత్ విశ్లేషాన్ని సహించలేక భగవత్ సంశ్లేషము కొరకు ఆచరించిన గొప్ప వ్రతం ధనుర్మాసవ్రతం. తిరుప్పావై వ్రతం అన్ని శ్రీవైష్ణవ దేవాలయాల్లోనూ శ్రీవైష్ణవ గృహారాధనల్లోనూ వైభవంగా ఆచరించబడుతున్నది. 30 రోజులు 30 పాశురాలు ఆరాధనా స్తోత్రాలుగా అర్థ అనుసంధాన కాలక్షేపంతో భగవత్సేవలో ఆనందించే కాలమే ధనుర్మాసం దివ్య మధుర పదార్థమైన "పొంగళిని" నివేదన గావిస్తూ ధర్మాచరణతో సాగే ఈ వ్రతం శ్రీ గోదా రంగనాయకుల వివాహంతో ముగుస్తుంది

కళ్యాణ రత్నం గా పిలువబడు శ్రీ గోదా రంగనాయకుల కళ్యాణం ప్రశస్తమైనది జీవాత్మ స్వస్వరూప జ్ఞానం తెలుసుకొని శరణాగతితో పరమాత్ముని పొందే సాపదేశార్థాన్ని ఆండాళ్ కళ్యాణానికి విశేషార్థంగా పెద్దలు చెబుతారు. శ్రీ మహాలక్ష్మి తత్వంతో సమన్వయీకరించి 'శ్రీ సన్నిధానంలో' మనం ఆచరించే తిరుప్పావై వ్రతం ఆండాళ్ తల్లి అనుగ్రహాన్ని మనకు ప్రసాదించే పెన్నిధానం. తిరుప్పావై వ్రతం సకల ఐశ్వర్యాలను ప్రసాదిస్తుంది అని మన పెద్దల ఉపదేశం.


రచనలకు ఆహ్వానం

సాహిత్యాభిమానులకు, పండితులకు మా శ్రీసన్నిధానం పత్రికలో ఆధ్యాత్మిక సంబంధ వ్యాసాలు, దేవాలయ విశేషాలు, కవితలు, పద్యాలు ఇతర రచనలు పంపించదలచిన వారు సంప్రదించండి.

Whatsup no 9502583323

త్వరలో రాబోయే శీర్షికలు







ఆధ్యాత్మిక జ్యోతిష్య ధార్మిక సంబంధిత సందేహాలకు ప్రముఖుల సమాధానాలు

# తిరుప్పావై వ్రత నియమాలు

లోకంలో ఏపని చేయడం ప్రారంభించినా అది విజయవంతం కావటానికి ముందుగా సంసిద్ధత అంటే ప్రణాళికను కూర్చోవడం, భౌతిక మానసిక సంసిద్ధత తప్పనిసరిగా చేయదగినది. పని ఎప్పుడు చెయ్యాలి ఎక్కడ చేయాలి అని స్థల నిర్ణయం సమయానుక్రమణిక ను ఏర్పరచుకోవడం చేసే పని సక్రమంగా సాగడానికి ఉపకరించే వారిని సమన్వయించుకోవడం, పని చేసేటప్పుడు కలిగే అవాంతరాలను ఎలా ఎదుర్కోవాలో ఆలోచించుకోవడం, పని బాగా పూర్తి కావాలంటే ఏమేమి చేయకూడదో మనకంటే ముందుచేసినవాళ్ళు ఎలా చేశారు? పనిని ఆచరించడంలో మన యోగ్యత ఎటువంటిది ఇత్యాది అంశాలను సమాలోచించుకుని ప్రారంభించి పనిని పూర్తి చేస్తాం! పని ప్రాధాన్యాన్ని బట్టి ఈ అనుసరణ సాగుతుంది.

ఇది లౌకిక విషయాలకు సంబంధించినది మాత్రమే.

భగవత్ సంబంధమైన పరమోత్కృష్టమైన ప్రపత్తి వ్రతం ధనుర్మాస వ్రతం! పరమార్థ సాధకమయిన ఈవ్రతానికి ఎలాంటి నియమాలు పాటించాలని మన ఆండాళ్ తల్లి మన పెద్దలు ఆదేశించారు. కేవలం 30 రోజులు అనుష్ఠించేది తిరుప్పావై వ్రతం అయితే జన్మాంతం దాకా అనుసరించాల్సినవి శరణాగతి వ్రత నియమాలు. సాత్విక గుణ జనకమైన జీవనశైలి సమాజ శ్రేయస్సుకు, స్వీయ రక్షణకు ఉపయోగపడుతుంది.

తిరుప్పావై వ్రతం అత్యంత ప్రధానమైనదని మన పెద్దలు, పూర్వాచార్యులు ఎన్నో ఏళ్లుగా ప్రబోధిస్తూ ఆచరిస్తూ చూపిస్తున్నారు. ఉజ్జీవన మార్గాన్ని సూచిస్తూ, సకల సంపదలు ప్రసాదించే వ్రతంగా గోదాదేవి తాను ఆచరించి మనకు ఆదేశించింది.

గోదాదేవి తనతో పాటుగా వ్రతాన్ని ఆచరించే గోప స్త్రీలకు తెలిపిన వ్రత నియమాలు

* పాలను భుజింపము.( ఆహార నియమం)

* నేతిని భుజింపము ( సాత్వికాహారం శ్రేయోదాయకం రాజస తామస గుణ ప్రేరకాలైన ఆహారాలను వర్జించాలని పెద్దల మాట. అనగా ఉచ్ఛిష్టము, జాతిదుష్టం, భావదుష్టము మొదలైన వాటిని భుజించకుండా ఉండడం, కాలనియతి, మితాహారం, శుచి పాటించటం ఇత్యాది.

* కాటుకను,పూలను పెట్టుకోము (బాహ్య అలంకారాలు దేహాలంకారాల యందు విరాగం కలిగి ఉండాలి. భగవంతునికి భోగ్యవస్తువుగా అలంకారాలనుధరించ వచ్చును)

*నాట్కాలేనీరాడి ... ఉదయాత్పూర్వం బ్రాహ్మీముహూర్తంలో మేల్కొని స్నానం చేయాలి. (కేవలం బాహ్య స్నానమే కాకుండా భగవద్గుణ అనుభవంలో అవగాహన పొంది సంసార ఆర్తి తాపాన్ని పరిహరించుకోవాలి)



* చేయకూడని పనులు చేయము. (చేయకూడని పనులు అనగా వేద బాహ్యమైన శాస్త్ర బాహ్యమైన పనులు చేయకూడదు. శిష్టులైన పెద్దలు చేయని పనులు చేయరాదు. 'యద్యదాచరతి శ్రేష్ఠః' అని మన పెద్దవారు ఆళ్వార్, ఆచార్యులు ఆచరించినవి అనుసరించాలి.

* వేరొకరిని బాధించే మాటలను వారి వద్దకు వెళ్లి చెప్పము. (పరుషమైన మాటలు ఒకరిని బాధించే మాటలు అసత్యపు మాటలు మాట్లాడరాదు )

* సాధువులకు సన్యాసులకు పాత్రత నెరిగి చేయిచాచి సమర్పిస్తాము. (సత్పాత్ర దానము ఆచరిస్తూ సాధువులకు సన్యాసులకు కావలసింది చేయిచాచి సమర్పించుకోవాలి)

* ఉజ్జీవించే జీవన మార్గాన్ని అనుసరించాలి ఈ వ్రత నియమాలను గోదాదేవి తిరుప్పావై రెండవ పాశురంలో అనుగ్రహించింది. పారమార్థిక జీవన లక్ష్యం కలవారు తప్పక పెద్దలు చెప్పిన నియమాలను అనుసరిస్తూ జీవించే మార్గంలో పయనిస్తారు. మరియు నిత్యారాధనము, నిత్య అనుష్టానం, సేవా కాలము, భగవత్ గుణానుభవము పెద్దలు చెప్పిన రీతిలో అనుసరించాలి.

*

# యజ్ఞంతో లోకహితం

**"ఆచార్యవాన్ పురుషో వేద" అని వేదాధ్యయనం,వేదార్థం, పరిరక్షణ, ప్రబోధం, ప్రవర్తకం అన్నీ ఆకారంగా రూపు దాల్చిన పరమాచార్యులు శ్రీశ్రీశ్రీ శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి వారు జీయర్ పురస్కారం సందర్భంగా ఇచ్చిన అమూల్యమైన సందేశం యధాతథంగా.... ప్రస్తుతం నెలకొని ఉన్న సమస్యలనుంచి బయటపడాలంటే మనం ఏంచేయాలో చెపుతూనే అలాంటి కార్యక్రమాన్ని లోకహితం కోసం చేస్తున్నట్లు వారు వెల్లడించారు. ముఖ్యంగా వేదాన్ని అధ్యయనం చేసిన వారిని సన్మానించడం ఈ విషయంలో మొదటి మెట్టుకాగా సమతామూర్తి ఆవిష్కరణ సందర్భంగా చేపట్టిన 1035 కుండాల వల్ల జరిగే ప్రయోజనం రెండవ అంకంగా అభివర్ణిస్తూ ప్రయోజనం సిద్ధించే మార్గాన్ని దర్శింపజేశారు. దీనివల్ల వచ్చే సంవత్సరం నుంచి సుభిక్షంగా ఉంటుందని ప్రవచించారు. 29వ జీయర్ పురస్కారానికి 2021 సంవత్సరానికి జీయర్ పురస్కారానికి బ్రహ్మశ్రీ శ్రీగోపాల ప్రసాద్ శర్మ గారిని, వారి శ్రీమతి గారు పద్మ దేవిగారిని సత్కరించి వారికి జీయర్ పురస్కారాన్ని అందజేసిన అనంతరం శ్రీశ్రీశ్రీ త్రిదండి రామానుజ చిన్న జీయర్ స్వామి వారు తమ అమృతప్రవచనంలో 1035 కుండాల ప్రాశస్త్యాన్ని, తద్వారా సమాజానికి జరిగే ప్రయోజనాన్ని వివరించారు. హోమం ప్రాశస్త్యం దాని విధివిధానం ఎలా ఉంటుందో జీయర్ స్వామి మాటగా శ్రీవైష్ణవులకు తెలియజెప్పి తద్వారా హోమంలో పాల్గొని పునీతులు కావడానికి వచ్చిన సదవకాశాన్ని వినియోగించుకుంటారన్న అభిలాషతో ఈ వ్యాసాన్ని ప్రచురిస్తున్నాము.**

## ఆచార్యుల సందేశం



దీపావళి మహోత్సవాన్ని మనం ఏదో కేవలం సరదాకి చేసుకునే కార్యక్రమం లాగా కాకుండా ప్రతి దీపావళి కి వేదాల్లో కృత పరిశ్రములైనటువంటి ఒక్కొక్క మహనీయులని అవకాశం ఉంటే ఇద్దరినీ ముగ్గురు నైనా మన సత్కారం చేసుకోవాలి తద్వారా వేద పురుషుడు యొక్క అనుగ్రహాన్ని పొందాలి. వేదాధ్యయనం చేసినటువంటి మహనీయులు సంచరించే వేదాలు.అర్థం తెలిసి వేదాన్ని అధ్యయనం చేసిన ఒకవేళ అర్థంలోకి వెళ్లకుండా కేవలం మూల గ్రంథాన్ని మాత్రమే అధ్యయనం చేసినప్పటికీ కూడా వేదాన్ని ధరించి ఒక వ్యక్తి ఉన్నారు.వారిని మనం సంచరించే వేదము అని అంటాము. (మొబైల్ వేద.)

ఏదయినా ఒంటికి అనారోగ్యం ఏర్పడితే అనారోగ్యం తొలగడానికి కొంతమంది తాయెత్తులు కట్టుకుంటూ ఉంటారు తాయత్తు అంటే ఏం చేస్తారు దాని మీద ఒక చిన్నచెట్టు నుంచి తీసినటువంటి ఒక బెరడు లాంటి దానిని లేదా ఒక రాగి పత్రం మీద కొన్ని బీజాక్షరాలు రాస్తారు. దానికి ఒక చిన్న డబ్బాలో పెడతారు. దానిని చేతికో,నడుముకో కట్టుమంటారు లేదా మెడలో వేసుకుంటారు. దాని అర్థం ఏమిటో తెలీదు కానీ అది మెడలో వేసుకున్నంతమాత్రం చేత రోగాలు తగ్గుతాయి అని చెబుతారు, వాడేటటువంటి వాళ్ళు చాలామంది వాటిని ప్రయోజన వంతంగా కూడా భావిస్తున్నారు.కొన్ని అక్షరాలకే ఆ ప్రభావం ఉంటే అక్షరరాశి కంతటికీ మూలమైనటు వంటి వేదం అనేది అత్యద్భుతమైనటు వంటి శక్తి కలిగినటువంటి ఒక అపౌరుషేయం అయినటువంటి గ్రంథం. అలాంటి దాన్ని తన హృదయంలో శాశ్వతంగా ఒక వ్యక్తిని పెట్టుకోగలిగారు అంటే ఆ వ్యక్తి యొక్క ప్రభావం ఆ ప్రాంతం అంతావుంటుంది. ఒక తాయత్తుకుండే ప్రభావం వేదాక్షర రాసి అంతా కూడా జ్ఞానమయంగా వ్యక్తి లోపల ఉండేటప్పుడు ఆ వ్యక్తి యొక్క ప్రభావం ఆ సంచరించే ప్రాంతం ఎక్కడుంటే అదంతా కూడా ప్రసరిస్తుంది ఇక అందులో ఏదో కొద్ది పరిశ్రమ చేసి దాని అర్థాన్ని కూడా తెలుసుకుని దానిని పది మందికి చెప్పగలిగేటటువంటి కృషి చేసే వ్యక్తులలో దాని యొక్క వికాసం మరింత విస్తరించి వుంటుంది. అలాంటి వ్యక్తి యొక్క పదార్పణ ఎక్కడ ఎక్కడ జరిగితే ఆ ప్రాంతమంతా పునీత అవుతుంది ప్రభావితం అవుతుంది అనడంలో సందేహం లేదు. అయితే విశ్వసించేవారికి దాని ఫలితాన్ని అనుభవించే అదృష్టం కలుగుతుంది.మాకు దాని మీద నమ్మకం లేదు అంటే దాన్ని కాదు దేవుడు ఎదురుగా వచ్చినా దాని యొక్క ప్రయోజనాన్ని ఆ వ్యక్తి పొందలేడు. మనం భారతదేశంలో పుట్టి, అదృష్టంకొద్ది ఆ వైదిక మైనటువంటి పరంపరని గౌరవించే గలిగే కుటుంబాల్లో పుట్టాం. ఆ విధంగా మన జీవితాన్ని సాగిస్తున్నాం.

ఆ వేదాల్లోఉండేటటువంటి వైభవాన్ని అక్షరరాసిగా కాని,

అర్థంగా కాని, దాన్ని మరొకరికితో అధ్యయనం చేయించే పద్ధతిలో కానీ ఎవరెవరు కృషి చేస్తూ మన దేశంలో అనేక ప్రాంతాల్లో ఉంటారో అలాంటి వాళ్ళలో కొందరినైనా సత్కరించుకొని, వారిని దర్శనం చేసుకునేటువంటి ఒక భాగ్యం ఈ దీపావళి సందర్భంగా మనం పొందగలిగితే అది మనకి మనోబలాన్ని పెంచుతుంది, ఆత్మస్థైర్యాన్ని కలిగిస్తుంది అనే అభిప్రాయంతో "జీయర్ పురస్కారములనే పేరుతోటి 1994 నుంచి ఈ కార్యక్రమాన్ని జరుపుకునే అదృష్టాన్ని పొందుతున్నాం.ప్రతి ఏడాది ఒకరు ఇద్దరినో మనకు అవకాశం ఉన్నంతలో ఎక్కడెక్కడ అలాంటి మహానుభావులు ఉన్నారో వారిని వెతికి సత్కరించే ప్రయత్నం చేస్తున్నాం.

ఈ ఏడాది మన అందరికీ చాలా ప్రధానం మైనది.

ఒకటి రకరకాలుగా ప్రజలందరూ కూడా ఏ క్షణంలో ఎటు పక్కన ఏ వ్యాధి వస్తుందో, ఎక్కడ ఉంటుందో అనేటటువంటి భయంతోటి బ్రతికే కాలమిది. ఏదైనా...ఒక రకమైనటువంటి భయం కలిగించే వాతావరణం వ్యాపించి ఉంది అంతటా కూడా.

ఇందులోనుండి మనం బయటపడాలి. ఇప్పటికే సుమారు రెండు సంవత్సరాల కాలం గడిచింది.దశాబ్దాలు మనం ఈ రకమైనటువంటి వైరస్ ల తోటి వ్యాధుల తోటి బతకలేము కదా. ఇందులోంచి బయటపడటానికి ఏదో ఒక రకమైన ప్రయత్నం కావాలి.

రెండు రకాల ప్రయత్నాలు మనం చేస్తున్నాం.అందులో మొదటిది దైవాన్ని ప్రార్థన చేస్తూ దైవము యొక్క

"నిశ్వసితం వేదాః" అంటారు. వేదం అనేది భగవంతుడి ఊపిరి అంటారు. కనుక అలాంటి మహనీయులను మనం సత్కరించుకోవడం వారి యొక్క ఆ వైదికమైనటువంటి శబ్ద రాశి అంతట వ్యాపించే కృషి చేయడం. జ్ఞాన పరంగా లోపల ఆంతరమైనటువంటి ప్రపంచాన్ని శుద్ధి చేసేటటువంటిది ఇది అయితే ఇక రెండవది మన బాహ్యమయినటువంటి ప్రపంచాన్ని శుద్ధి చేసేది ఏదైనా ఒక ప్రయత్నం చేయాలి. ప్రభుత్వాల్లో ఉండే వాళ్ళు సామాన్యులు దానికి ఏదో వాళ్ళు చేసేది ఏదో ఒకటి చేస్తున్నారు అది ఒక రకంగా సాగుతోంది. కాని సమర్థవంతమైనటువంటి సాధనం ఇది అని మనకి మహానుభావులు చూపినటువంటి ఒక యజ్ఞం కూడా జరగవలసిఉన్నది అని మనందరం కూడా సిద్ధపడుతున్న సమయం.

ఈ ప్లవ నామ సంవత్సరం లోనే కార్యక్రమాన్ని మనం జరపాలి. రాబోయేటటువంటి సంవత్సరానికి ఈ రోగాల పీడల యొక్క. బాధ మనకి ఉండకూడదు. ఇది మనం కోరుకొంటున్నాం.రాబోయే సంవత్సరానికి పేరు"శుభకృత్" అని పేరు పెట్టారు అంటే మంచిని చేసేది అని అర్థం. అది నిజంగా మంచిది చేయగలిగే సంవత్సరం గానే ఉండాలి అని మనం భగవంతుని ప్రార్థన చేస్తూ...రాబోయే సంవత్సరంలోకి ఈ ప్లవ నామ సంవత్సరం మనని నడపాలి "ప్లవ" అంటే పడవ అని అర్థం కదా అది అందరికీ తెలుసు. ప్రస్తుతం పడవలో సాగుతున్నాము. ఈ పడవ మనను సరియైన తీరానికి చేర్చాలని. ఎక్కడో సుడిగుండంలోన మనని పారవేయకూడదు. సవ్యంగా ఆవలిగట్టుకి మనం చేరగలిగేటట్లుగా ఆనందాన్ని మనం పొందగలిగేటట్లుగా నడపాలి నిజంగా రాబోయే సంవత్సరం శుభకృత్ కావాలి.

అందుకోసం మనమందరం కూడా రామానుజ సహస్రాబ్ది సమారోహం కార్యక్రమాల్లో ఒక 1035 కుండములతో శ్రీ లక్ష్మీ నారాయణ మహా యజ్ఞం కార్యక్రమాన్ని జరుపుకోవాలి అని మన పెద్దలు అందరూ కూడా నిర్ణయం చేశారు. ఆ కార్యక్రమాన్ని మనం సమర్థవంతంగా జరుపుతాము అనే మహెూద్యమాన్ని చేయాలి అని కార్యకర్తలు ముందుకు తీసుకు వెళ్లుతున్నారు కూడా. అందులో వాడే నెయ్యి పరిశుద్ధమైనది కావాలి, సమిధలు పరిశుద్ధమైనదవి కావాలి, మంత్రము శుద్ధమైనది కావాలి. ప్రక్రియ సరియైనటువంటి పద్ధతిలో సాగాలి.ఏలోపం లేకుండా ఇది జరగాలి. మనకి మన శాస్త్రాల్లో మన పెద్ద వాళ్ళు చెప్పారని "అగ్నౌ ప్రాస్త ఆహుతిః సమ్యక్ ఆదిత్యం ఉపతిష్ఠతే. ఆదిత్యాత్ జాయతే వృష్టిః. వృష్టేః అన్నం. తతః ప్రజాః " అని ఒక నియమం ఉన్నది మనం చేసేటటువంటి హెూమ ప్రక్రియ పద్ధతి వుంది. ఏదో వచ్చి ఒక పూట కుండంలో అందులో నిప్పులు వేయడం పద్ధతి అనిమనపెద్దవాళ్ళు చెప్పాలా ?

ఆ చేసే వ్యక్తి యోగ్యత కలిగిన వాడు కావాలి.

అగ్నిహెూత్రం ఒకపక్క పద్ధతి తయారు లో చేయాలి

ఆ తయారైన అగ్నికి ఒక పద్ధతి ప్రకారం రక్షణ కలిగించాలి.సురక్షితంగా ఉండేటువంటి నియమాలు ఉన్నాయి. అగ్ని లో కొన్ని నియత అయినటువంటి ద్రవ్యాలతో ఆహుతులు చేయాలి. దానితో యోగ్యమైన మంత్రాన్ని జోడించాలి. మంత్రం ఒక శబ్దం, ఆహుతి ఒక ద్రవ్యం అటువంటి శక్తి, హెూమ ధూమం అవి చాలా ప్రభావంకలిగినవి. ఇవి వాతావరణంలో వ్యాపిస్తే సూర్యకిరణములలో లోపములను తొలగించ గలిగే శక్తి పెరుగుతుంది. ఆకిరణాలు రెండు రకాలుగా పనిచేస్తాయి. ఒకటి ప్రకృతి లో వుండే లోపాలు తొలగిస్తాయి .రెండవది మంచి పంటలు పండేటట్లు చేస్తాయి.

ఇక్కడ భూమి మీదవుండేటటువంటి జలాలని మారిస్తే కదా మనకు వాన వచ్చేది. వానలవల్ల కదా పంటలు పండేది. ఆ పంటలను కదా మనం తినేది. మనం అంటే ప్రాణికోటి అంతా అది మనుషులు తిన్నా, జంతువులు తిన్నా క్రిమికీటకాదులు తిన్నా నీరు సరియైనది అయితే ఆరోగ్యకరమైనది అవుతుంది. మేఘాలు సరియైనవి కావాలంటే ఆ మేఘాలు తయారు కావడానికి వాడే సూర్యకిరణాలు శక్తివంతమైనవి కావాలి. అది చేస్తుంది హెూమం పద్ధతిలో చేస్తే.రేపు రాబోయే ఫిబ్రవరి లో ఇక్కడ జరిగే ఆయజ్ఞం ఆపద్ధతిలో చేయాలని మన వాళ్లు అందరూ కూడా సిద్ధపడుతున్నారు. మీరందరూ కూడా ఆ కార్యక్రమంలో భాగస్వాములుగా మీ ప్రాంతాల్లో ప్రయత్నాలు కూడా చేస్తున్నారు.అలాంటి ఆహారాన్ని తీసుకున్నప్పుడు దానివల్ల ఏర్పడ్డ ఆహారాన్ని తీసుకున్నపుడు అలాంటి గాలిని పీల్చినప్పుడు ఆ రకమైనటువంటి **( మిగతా 11వ పేజీలో)**

# శ్రీ రామానుజ సుధా మాధురి

సమతామూర్తి శ్రీ రామానుజాచార్య కీర్తి సాటిలేనిది. వారి సహృదయం హృదయ సౌకుమార్యం వారి సూక్తుల్లో ప్రతిబింబిస్తుంది. వారు శిష్యులకు ఉపదేశించిన సూక్తి సుధా మాధురి సాంప్రదాయ సంస్కరణలను గావించింది. వారి జీవన మార్గ సరళిని పరిశీలిస్తే అతి సామాన్య జనులకు సకలైశ్వర్య ప్రాప్తి కలిగించుటకు వారు చేసిన కృషి మనకు గోచరిస్తుంది. పరమభక్తితో మనను మోకరిల్లేలా చేస్తుంది.

జ్ఞానవంతులైన పండితులను, భక్తి ప్రపూర్ణులైన పామరులను, శరణాగతి మార్గంగా ప్రపత్తిచేయు ప్రపన్నులను, భావోద్వేగం గల సామాన్యులను గుర్తించారు అన్ని రకముల వారు తరించే మార్గాన్ని సూచించారు అందరూ శ్రీ(శియఃపతుల పాదారవింద సేవలో తరించే సాంప్రదాయాన్ని స్థాపించారు. "సమ్యక్ శాస్త్ర జ్ఞానమునకు హేతువు భక్తి మాత్రమే" అని నిరూపించారు. అందుకే సాంప్రదాయ సిద్ధాంత జ్ఞానం శాస్త్రజ్ఞానం ఎంత కలిగి ఉన్నప్పటికీ "యస్య దేవే పరాభక్తిః యథా దైవే తథా గురౌ" అని శృతివాక్య ప్రమాణంగా భగవద్భక్తిని ఆచార్య భక్తిని ఉపదేశించారు. భగవత్ భాగవత ఆచార్య కైంకర్య నిష్ఠ నిజమైన దీక్ష అని శిష్యులకు ఆదేశించారు. శ్రీ రామానుజ తాత్విక సుధ ఉభయ తారకం అనుటలో సందేహం లేదు భగవత్తత్వ సౌందర్యాన్ని కళ్యాణ గుణాలను తెలిపి,భగవత్ ప్రాప్తి మార్గాచరణను సూచించారు. శరణాగతి మార్గమే రక్షక మని గద్యత్రయంలో ప్రత్యక్షీ భూతం చేశారు. దైవీ గుణసంపదలో ప్రధానమైన పరోపకార శీలతను ఉపదేశం చేశారు. వారి చరిత్రను అధ్యయనం చేస్తే ఆ 'శ్రీరామానుజ సుధామాధురి' మన జన్మను, హృదయాన్ని, చింతనను, ప్రవర్తనను, అన్నింటినీ సంస్కరిస్తుంది. పారమార్థిక జీవన మార్గం వైపు మనను మరలుస్తుంది. సకలజీవరాశులను, స్త్రీలను, పామరులను, సామాన్యులను, వక్రమార్గ గాములను శ్రీ రామానుజాచార్యులు ఉద్ధరించిన వైనం పరిశీలిస్తే జగదాచార్యుల శరణాగతిలో శ్రీరామానుజ సుధామాధురిలో మనం



పునీతం అవుతాము! సకల ఐశ్వర్య వంతులము అవుతాము.

శ్రీ రామానుజ సహస్రాబ్ది సమారోహ సమీప శుభ సమయంలో జగదాచార్యుల కైంకర్యముగా శ్రీ శ్రీనివాస స్వరూపులైన శ్రీశ్రీశ్రీ చిన్న రామానుజ జీయర్ స్వామి వారి వాక్సుసుధా మార్గ అనుసరణలో మనం సంసిద్ధం కావటం మరింత సంపన్న దాయకం!

జగదాచార్యులైన భగవత్ రామానుజాచార్యుల సిద్ధాంత మార్గదర్శనంగా ప్రతి సంచిక యందు వారి దివ్య కథా వైభవాలను, శ్రీ రామానుజ సహస్రాబ్ది వైభవాలను మనం సేవించుకుందాము.

**శ్రీరామానుజార్య దివ్యాజ్ఞా! వర్ధతాం అభివర్ధతాం!!**

## యజ్ఞంతో లోకహితం

**(10వ పేజీ తరువాయి)** నీటిని తాగినప్పుడు. అంతా ఏదో శక్తి కావాలి అనుకుంటున్నారు కదా. ఇమ్యూనిటి పెరగాలి అనుకుంటున్నారు కదా. అది దీని వల్ల పెరుగుతుంది. అది పెరిగితే బయట ఉండే ఇటువంటి వాతావరణం ఏరకమైన కాలుష్యాలు అయినా వాటి గురించి మనకు పెద్దగా భయపడాల్సిన అవసరం రాదు. అందుకోసమనే మనం వేదవిద్వాంసులను సత్కారం చేసుకుంటూ వారి ద్వారా వెలువడే వైదిక శబ్ద తరంగాల ద్వారా ప్రకృతిని పావనం కావించాలి.

మనలో వుండే శ్రద్ధ తోటి మనం జరిగేటువంటి రాబోయే రామానుజ సహస్రాబ్ది మహోత్సవ కార్యక్రమం పద్ధతి ప్రకారం జరుపుకొనేటటువంటి కార్యక్రమం జరగాలి. ఈ రెంటి ద్వారా మనం బయపడే కరోనా దూరంకావాలి. శుభకరం కావాలి. అప్పుడు రాబోయే సంవత్సరం శుభకృత్ అవుతుంది. మన లోపల వుండే చీకట్లు పోవాలి.

# ఆశయం - ఆకాంక్ష - ఆలోచన - ధ్యేయం

భగవంతుని సృష్టిలో మానవజన్మ ఉత్తమమైనది ఆకలి తీర్చుకోడానికి తినడం, నిద్రించడం, సంతతి కనడం మొదలగు పనులు పశు పక్ష్యాది మొదలగు ఇతర జీవులు కూడా చేస్తాయి, ఇతర జీవులకు మానవులకు తేడా ఏమిటి. ఆలోచనా శక్తి, మంచి-చెడు, ఎలా జన్మించాం? మరణించాక ఎటు వెళ్ళుతాం? జీవిత లక్ష్యం ఏమి? ఏం చేయాలి అను విషయాలను ఆలోచించడానికి ఒక మానవ జన్మకే సాధ్యం.

పరమ దయామయుడగు పరమాత్మ వేదాల ద్వారా, శాస్త్రములలో ఇవన్ని వివరించారు ఋషులు ఇతిహాస పురాణములలో విపులీకరించినారు. అంతేగాక మానవుడు సాటి మానవులతో ఎలా మెలగాలి అనే విషయాలను తెలపడానికి భగవానుడు మనకై మానవుడుగా అవతరించి, ఆచరించి తెలిపారు. ఋషులద్వారా, మహాపురుసులుగా, ఆళ్వారులుగా తమ రచనల ద్వారా బోధించారు. ఈకలియుగంలో, నేటి వాతావరణంలో, ప్రస్తుత పరిస్థితులలో అన్ని విషయాలు ప్రతివ్యక్తి చదివి తెలుసుకొని జీవించడం కాని పని. మానవ కర్తవ్యం ఏమి సుఖంగా ఆనందంగా ఎలా జీవించగలం వేదాలు శాస్త్రాలు చదివే అవసరం లేకుండా వాటిలో కారణాంశాలను బోధించే ఆచార్యులున్నారు. మనం సమయం కలుగచేసికొని వినే ప్రయత్నం చేయాలి. కాని మనలో చాలామందికి వీలు కాదు. సమయం లేదండి అంటారు. ఏ కొద్దిపాటి సమయమైనా వెచ్చించడానికది దొరకదు. వీలైనంత తక్కువ సమయం వెచ్చించి విషయాలను తెలుకోవడానికి పుస్తకాలు పత్రికలు తోడ్పతాయి. శాస్త్రాలలో పురాణాల్లో ప్రబంధాలలోని విషయాలను, మానవుడు సుఖశాంతులతో జీవనయాత్ర సాగించుటకు వీలుకలిగే విషయాలను సులభ శైలిలో ప్రచురించి పాఠకులకు అందించే ప్రయత్నం శ్రీసన్నిధానం ఆశయం. క్షణికోల్లానము, భావోద్రేకము కాలక్షేపమునకు పత్రికలెన్నోఉన్నాయి. మానసిక శాంతి, ఆధ్యాత్మిక వాతావరణము సృష్టించే పత్రికలు అరుదు.దానవుడుగా ఉన్న మానవుడు మానవుడుగా మనుగడ సాగించడానికి సత్ప్రవర్తన, సదాశయములు తెలుపు పత్రికలెంతో అవసరము. ప్రతి మానవుడు భక్తి ప్రపత్తులతో మెలిగి తోటి మానవులతో సౌహార్దంగా వ్యవహరించిన, వ్యక్తి సుఖం, సమాజ శ్రేయస్సు, తద్వారా విశ్వశాంతి కలుగును ఈ విషయాలను క్రోడీకరించి ప్రతినెల మీకు సమర్పించడమే. 'శ్రీసన్నిధానం ధ్యేయం. మహర్షుల, మహాత్ముల, భక్తుల ఆళ్వారాదుల జీవితచరిత్రలు బాలబాలికల ఉపయోగార్థమై ప్రచురించాలని మా ఆకాంక్ష త్వరలో భక్తి ప్రవృత్తి విషయాల సాహిత్య పదకేళి పత్రికలో ప్రారంభించాలనే అభిలాష కలదు.

పండితులు, విద్యావేత్తలు భక్తి ప్రపత్తులతో బోధించు తమ రచనలు, సమాజ శ్రేయస్సు దృష్ట్యా, సామాన్యునకర్థమైయే సులభశైలిలో వాసి పంపుతూ పత్రికాభివృద్ధికి తోడ్పడాలని మా మనవి. సహృదయుగు పాఠకులు, భక్తి ప్రపత్తుల అభివృద్ధికై వ్యక్తి వికాసానికై తద్వారా సమాజ శ్రేయస్సుకై విశ్వశాంతి సాధనకై తాము సహకరించాలని కోరుతున్నాము.

శ్రీసన్నిధానం ప్రారంభపు సంచిక కోసం...

(ఆచార్య తిరువడిగడికి వేంచేసిన)

**శ్రీమాన్ సముద్రాల సీతారామాచార్యులు గారు**

**ఇచ్చిన వ్యాసం**

# శ్రీసన్నిధానం ఆస్తికజనుల కరవిభూషణం

**మా**నవజన్మమే అతి దుర్లభమైనది. పూర్వజన్మ సుకృతము భగవదనుగ్రహము తోడై లభించే అపురూప వరమిది.దీనిని సార్థక పరచుకొను వాడే ధన్యజీవి.పశు పక్ష్యాదుల కంటే జ్ఞానము అధికముగా కల జన్మమని భావింప బడునదీ మానవ జన్మము. కనుకనే తన జ్ఞానమును సక్రమముగా వినియోగించుకొను వాడే సార్థక జన్ముడు. జ్ఞానము అనగా లౌకిక విషయములను తెలుపునది కూడా అయినను, లోక వ్యవహారమునకు ఉపయోగపడు జ్ఞానము కూడా ఆవశ్యకమే! అయినను అది మాత్రమే జ్ఞానము కాదు. శాశ్వతమైన ఆనందమును కలుగజేయుటకు సాధనము జ్ఞానము. ఈ జ్ఞానము మనము పెద్దల సమూహములో వినినను తాత్కాలిక ప్రశాంతి, తాత్కాలిక జ్ఞానము లభించినట్లుండినను మరల విస్మృతిని కలిగించవచ్చును. ఈ జ్ఞానము మనచే నిత్యముగా పొందబడవలెనని దానికి లిఖిత రూపముననున్న గ్రంథములు ఆవశ్యకములు వ్యక్తులు అశాశ్వతులు కాని వారి జ్ఞానము గ్రంథముల రూపములో శాశ్వతముగా నుండవచ్చును. శ్రీసన్నిధానం అను ఈ పత్రిక ఆస్తిక జనులందరికి కర విభూషణమై అందరిచే ఆదరింపబడవలెనని శ్రీసింహాద్రి నాథుని ప్రార్థించుచున్నాను.

-సాతులూరి గోపాలకృష్ణమాచార్యులు,

సింహాచలం

నాడు వారు అనుగ్రహించిన మంగళాశాసనము

Marketing Editor Samudrala Raghuramacharya